బాన్సువాడలో ఉపఎన్నిక ఖాయం

- పోచారానికి ప్రజలు బుద్ధిచెప్తారు
- త్వరలో బాన్సువాడలో పార్టీ శ్రేణులతో భేటీ : కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): బాన్సువాడ నియోజకవర్గంలో ఉప ఎన్నిక ఖాయమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు స్పష్టంచేశారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ మారిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని, ఉప ఎన్నికల్లో ఆయనను కచ్చితంగా ఓడిస్తామని ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు నందినగర్ నివాసంలో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అన్ని విధాలుగా గౌరవించినా పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం కార్యకర్తలను బాధించిందని పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వారు ఎంత పెద్దవారైనా సరే వదిలిపెట్టేది లేదని, వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కనీసం గుర్తుచేసినవాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు.

పార్టీ కార్యకర్తలే కొండంత అండ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనా సమర్థత ఏమిటో ప్రజలకు తెలిసిపోయిందని, మార్పు పేరుతో ప్రజలను ఏమారుస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. త్వరలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులతో కలిసి బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీని వీడలేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే కొండంత అండ అని పేర్కొన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీని వీడినా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలంతా బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నారని ఈ సందర్భంగా ఆయా మండలాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు తెలిపారు.

మంగళవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న గురుకుల ఉద్యోగ అభ్యర్థులు

అభ్యర్థులకు న్యాయం చేయండి

- ప్రభుత్వానికి కేటీఆర్ సూచన
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కేటీఆర్‌ను కోరిన ఉద్యోగార్థులు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టుల్లో భర్తీ కాకుండా మిగిలిన పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నిరుద్యోగ గురుకుల అభ్యర్థులు నందినగర్‌లో కేటీఆర్‌ను కలసి వారి సమస్యలను వివరించారు. గురుకుల బోర్డు చేపట్టిన నియామకాల్లో డౌన్ మెరిట్ లిస్ట్ ఆపరేట్ చేయడం ద్వారానే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. గురుకుల బోర్డు చేపట్టిన నియామకాల్లో 9,024 పోస్టుల్లో డిసెండింగ్ ఆర్డర్ పాటించకపోవడం, చాలామందికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు రావడం వల్ల సెకండ్ మెరిట్‌లో ఉన్న వారికి నష్టం జరుగుతున్నదని వివరించారు. గురుకులాల్లో భర్తీ కాకుండా మిగిలిపోతున్న పోస్టులను తదుపరి మెరిట్ అభ్యరులతో భర్తీ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌ను విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జీవో-81పై హైకోర్టు ఐదు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ప్రభుత్వం ఆయా ఉత్తర్వులను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీఎస్ఎల్ నిర్వహించిన వివిధ నోటిఫికేషన్లలో ప్రస్తుతం భారీ సంఖ్యలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉన్నప్పుడు నిరుద్యోగులు నష్టపోకుండా చూడటం కోసం జీవో-81 అమలు చేయకుండా వన్‌టైం రిలాక్సేషన్ (సడలింపు) కల్పించి పోస్ట్ మిగిలిపోకుండా డౌన్‌మెరిట్ ఆపరేట్ చేసి తదుపరి మెరిట్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారని గుర్తుచేశారు.

సీఎస్‌కు కేటీఆర్ ఫోన్

గురుకుల అభ్యర్థులు పేర్కొన్న అంశాలను, వారి అభిప్రాయాలను సావధానంగా విన్న తరువాత ఈ విషయంలో వారికి న్యాయం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కేటీఆర్ కోరారు. గురుకుల, డీఎస్సీ అభ్యర్థుల పక్షాన ఆయన సీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గతంలో అనుసరించిన విధానాన్ని అమలుచేసి అభ్యర్థులకు న్యాయం చేసే అన్ని అవకాశాలను పరిశీలించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తమ అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కేటీఆర్‌కు గురుకుల అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో గురుకుల నిరుద్యోగ విద్యార్థులు రత్నశేఖర్‌రెడ్డి, స్వాతి, నిరుద్యోగ విద్యార్థులు దామోదర్‌రెడ్డి, విక్రమ్‌తోపాటు రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



రాష్ట్రాన్ని అదానీకి అప్పగిస్తే సహించం

- ఢిల్లీలో పోరాటం.. తెలంగాణలో రెడ్ కార్పెటా?
- అదానీతో దేశానికి నష్టం.. తెలంగాణకు లాభమా?
- రాహుల్‌గాంధీపై కేటీఆర్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు అధికారమిచ్చిన పాపానికి తెలంగాణను అదానీకి అప్పగించాలని చూస్తే సహించబోమని, రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ-సెబీ వ్యవహారంపై దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ పిలుపునిచ్చిన సందర్భంగా ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి కేటీఆర్ ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో అదే అదానీ కంపెనీకి స్వాగతం పలకడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా? అదానీపై జాతీయ కాంగ్రెస్‌కు ఒక నీతి.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు మరో నీతా?' అని ప్రశ్నించారు. 'ఒకవైపు మీరేమో అదానీ-సెబీ ఆరోపణలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నారు. కానీ, ఇక్కడ (తెలంగాణలో) మీ కాంగ్రెస్ సీఎం మాత్రం అదానీకి రెడ్‌కార్పెట్ పరుస్తున్నారు. అదానీ కంపెనీకి ద్వారాలు తెరుస్తున్నారు. విద్యుత్తు పంపిణీ వ్యవస్థను ఏకంగా అదానీకే అప్పగిస్తున్నారు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. అదానీ-కాంగ్రెస్ మిలాఖతై లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నారనే అనుమానాలకు బలం చేకూరేలా తెలంగాణలో పరిణామాలు ఉన్నాయని విమర్శించారు. అదానీ వల్ల దేశానికి నష్టం అన్నప్పుడు.. తెలంగాణకు లాభమెలా అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు.

కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనం?

'తెలంగాణలో అదానీ కంపెనీల ఆగమనాన్ని రాహుల్‌గాంధీ ఆపగలరా? తమ పార్టీ ముఖ్యమంత్రి నిర్వాకాన్ని నిలదీసే ధైర్యం చేయగలరా? అదానీ పెట్టుబడులకు ఫుల్‌స్టాప్ పెట్టగలరా? రేవంత్‌రెడ్డికి మొట్టికాయలు వేయగలరా? అంత శక్తి రాహుల్‌గాంధీకి ఉన్నదా?' అంటూ రాహుల్‌పై కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. అదానీపై ఢిల్లీ కాంగ్రెస్‌ది ఒకమాట, గల్లీ కాంగ్రెస్‌ది మరో మాటనా? అని మండిపడ్డారు. అదానీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్‌లో ఈ ద్వంద్వ వైఖరి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం కాదా? అని నిలదీశారు.

ప్రభుత్వ ప్రోద్బలంతోనే హత్యలు

- బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి మూడు నెలలైనా కేసులో పురోగతి ఏదీ?
- సిట్ విచారణ ఎక్కడ?: నిరంజన్‌రెడ్డి

వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

చిన్నంబావి, ఆగస్టు 13 : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలంతోనే రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నేత అభిలాష్‌రావు నివాసంలో శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి మూడు నెలలైనా కేసులో పురోగతి లేదని, నేటికీ హంతకులను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిట్ ఏర్పాటు చేసి 27 రోజులు అవుతున్నా ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. ఇంతకీ సిట్ ఎక్కడా? అని ఆయన ప్రశ్నించారు. సొంత నియోజకర్గంలో హత్య జరిగితే కనీసం మంత్రి సదరు కుటుంబ సభ్యులను పరామర్శించలేదని దుయ్యబట్టారు. ఇదిలావుంటే మృతుడిపై వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ హత్య జరిగినా ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం పరిష్కరించే దిశగా అడుగులు వేయాలే కానీ, వ్యక్తిగత విషయాలను లాగి కేసును పక్కదోవ పట్టించడం సరికాదని సూచించారు. పది రోజుల్లో నిందితులను న్యాయస్థానంలో నిలబెట్టకపోతే డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	37.3°c	22.7°c
ఆదిలాబాద్	37.0°c	24.8°c
మెదక్	35.6°c	22.9°c
ఖమ్మం	33.0°c	25.0°c
నిజామాబాద్	32.8°c	24.6°c
మహబూబ్‌నగర్	32.4°c	23.2°c
వరంగల్	33.0°c	26.0°c
హైదరాబాద్	33.0°c	27.0°c
కరీంనగర్	32.0°c	26.0°c
నల్లగొండ	31.5°c	24.4°c

15 వరకు రాష్ట్రంలో వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్ర వెల్లడించింది. హైదరాబాద్‌లో మరో 4 రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు.

నేటి నుంచి 'రాజ్యసభ' నామినేషన్లు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాజ్యసభ ఉప ఎన్నికకు బుధవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. తొలిరోజు నుంచి ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. బీఆర్ఎస్ సభ్యుడు కే కేశవరావు రాజీనామాతో ఏర్పడిన ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి ఎన్నికయ్యే వారు 2026 ఏప్రిల్ 9 వరకు కొనసాగనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ పేర్కొన్నది. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఆగస్టు 27న ప్రకటిస్తారు. ఒకవేళ ఎన్నిక అవసరమైతే.. సెప్టెంబర్ 3న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారు.

నేడు వైద్యసేవల బహిష్కరణ

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ జూడాలు, సీనియర్ రెసిడెంట్ల నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఓపీ, ఓటీ సేవలను బహిష్కరిస్తున్నట్టు జూనియర్ డాక్టర్లు, సీనియర్, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈనిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

ఏఐతో కంటెంట్ రైటింగ్‌లో శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో కంటెంట్ క్రియేటివ్ రైటింగ్‌లో 27 నుంచి 29 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దరఖాస్తు చేసుకొనే తొలి 40 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఆ సంస్థ మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ హెడ్‌వోడీ నుంచి లేదా రిపోర్టింగ్ ఆఫీసర్ నుంచి సిఫారసు లేఖతో kskrishnaraj.nird@gov.inకు ఈమెయిల్ పంపించాలని సూచించింది. వివరాలకు 7560811100/040-24008468 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరింది.

మహాలక్ష్మిలకు 'రాఖీ' బంపర్ ఆఫర్

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): స్వయంగా వెళ్లి రాఖీ కట్టలేని యువతులకు, మహిళలకు 19న రక్షాబంధన్ సందర్భంగా ఆర్టీసీ లాజిస్టిక్ అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. రాఖీలు, స్వీట్లు బట్వాడా కోసం ప్రధాన బస్టాండ్లలో అదనంగా 100కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించింది. బుక్ చేసిన కౌంటర్ నుంచి 24గంటల్లో వాటిని డెలివరీ చేస్తామని అధికారులు హామీ ఇస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 490కి పైగా బుకింగ్ కౌంటర్లు ఉన్నట్టు తెలిపారు. తెలంగాణలో మాత్రమే కాకుండా, పొరుగున ఉన్న ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు రాఖీలను, స్వీట్లను పంపించుకోవచ్చు అని పేర్కొంటున్నారు. యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం విజ్ఞప్తిచేసింది. వివరాలకు https// www.tgrtclogistics.co.inలో సంప్రదించాలని కోరారు.

రుణమాఫీలో రైతుకు ద్రోహం జరిగింది

మొదటిపేజీ తరువాయి...

హాజరైన ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. సొంత పార్టీ నాయకుడే ముఖ్యమంత్రిపై ఇలా వ్యాఖ్యలు చేయడమేమిటంటూ వేదికపైన ఉన్న ఎమ్మెల్యే మురళీనాయక్‌తోపాటు జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు, ప్రజలు ఒక్కసారిగా కంగుతిన్నారు.

రేపటిలోగా మాఫీ చేయాలి

- ఆగస్టు 15 లోగా పూర్తిచేస్తానన్న ముఖ్యమంత్రి ఎక్కడ?
- 31 వేల కోట్లకు మీరు మాఫీ చేసింది 18 వేల కోట్లా ?
- రవాణా శాఖ అవినీతిపై పొన్నం శ్వేతపత్రం ఇస్తారా?
- బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజం

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : రూ.31 వేలకోట్లతో రుణమాఫీ అని చెప్పి రూ.18 వేలకోట్లతో మమ అనిపించే ప్రయత్నం చేస్తున్నారని, రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయకుంటే ఆగస్టు 15 తర్వాత కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరగలేరని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, పల్లెర వితో కలిసి పెద్ది మీడియా సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీకి సంబంధించి మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. హరీశ్‌రావు పనితనాన్ని తప్పుపట్టే నైతిక అర్హత పొన్నం ప్రభాకర్‌కు లేదని తేల్చిచెప్పారు. రైతుల పక్షాన హరీశ్‌రావు మాట్లాడితే పొన్నం సహా మంత్రులు పిచ్చి కూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. వాస్తవంగా రుణమాఫీకి రూ.45 వేలకోట్లు అవసరమని బ్యాంకింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారని చెప్పారు. కానీ లెక్కలను చెప్పేందుకు ప్రభుత్వం జకుంతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ కాల్‌సెంటర్‌కు రుణమాఫీపై ఇప్పటికే 75 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయని, రుణమాఫీ కాని రైతుల పక్షాన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. చేయని తప్పులకు రైతులను, సహకార సంఘాలను ప్రభుత్వం బాధ్యులను చేస్తోందని, నల్లబెల్లి మండలంలో రైతులు, సహకార సంఘాలను క్రిమినల్స్‌లా చిత్రీకరిస్తూ కేసులు నమోదు చేస్తున్నదని విమర్శించారు. రవాణా శాఖలో ప్రతి జిల్లాకు కోటి చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని, పౌర సరఫరాలశాఖలో 1832 కలెక్షన్ సెంటర్లు పెట్టి మిల్లర్లను వేధిస్తున్నారని, బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు రూ.75 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 3.24 లక్షల కోట్లే అప్పు అయినట్టు హరీశ్‌రావు గణాంకాలతో సహా చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే 50 వేలకోట్ల అప్పు చేసిందని, పొన్నం పిచ్చి కూతలు బంద్ చేయాలని, సమాధానం చెప్పే ధైర్యం సీఎంకు, మంత్రులకు లేదని ఎద్దేవా చేశారు.

వయసు పెరిగింది.. బుద్ధి పెరగలే : ఎర్రోళ్ల

మంత్రి పొన్నంకు వయసు పెరిగింది తప్ప బుద్ధి పెరగలేదని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ దుయ్యబట్టారు. మాట్లాడితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై బురద జల్లడం తప్ప పొన్నం చేస్తున్నదేమీ లేదని దెప్పిపొడిచారు. అవినీతికి పర్యాయపదం కాంగ్రెస్ అని, కలెక్షన్ సెంటర్ల గురించి పొన్నం మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. రవాణా శాఖలో అవినీతి జరగలేదని పొన్నం శ్వేతపత్రం విడుదల చేయగలరా? అని ప్రశ్నించారు. కరప్షన్, కలెక్షన్ కాంగ్రెస్ విధానమని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఒక్క బస్సూ కొనలేదని పొన్నం అంటున్నారని, కేసీఆర్ హయాంలో ఎన్ని బస్సులు కొనారో సజ్జనార్‌ను అడిగి తెలుసుకోవాలని హితవుపలికారు. 500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థలైన ఒలెక్ట్రా, జేబీఎంకు ధారాదత్తం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. ఆర్టీసీకి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీనైనా కాంగ్రెస్ నెరవేర్చిందా? అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సులను ప్రైవేట్‌కు కట్టబెట్టడంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై సీబీసీఐడీ దర్యాప్తునకు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. లాభాల్లో ఉన్న ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారని మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే రూ.2100 కోట్ల నష్టంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. ఏఐసీసీ అంటే అల్ ఇండియా కరప్షన్ కమిటీ అంటూ ఎద్దేవాచేశారు.

ఏపీ నెత్తిన సర్కారు పాలు!

మొదటిపేజీ తరువాయి...

సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాల రైతులు పరేషాన్‌లో ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌లో 30 లక్షల లీటర్ల పాలు ప్రతి రోజూ వినియోగిస్తారని, తెలంగాణ నుంచి వస్తున్న ఐదు లక్షల లీటర్లుకు కూడా డబ్బులు చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా 25 లక్షల లీటర్ల పాలు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. తెలంగాణ డెయిరీని బొంద పెట్టి ఆంధ్రా డెయిరీలను పెంచి పోషించే కుట్ర జరుగుతుందా అనే అనుమానాన్ని వ్యక్తంచేశారు. విజయ డెయిరీ లో రూ.500 కోట్ల నెయ్యి, పాలపొడి ఇతర ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని, వాటి గడువు దాటితే రూ. 500 కోట్లు బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని యాదాద్రి దేవస్థానానికో, తిరుమల వెంకటేశ్వర స్వామి గుడికో విక్రయిస్తే బాగుంటుందని సూచించారు. పాడి రైతులకు ఇవ్వాల్సిన నాలుగు నెలల బకాయిలు పదిహేను రోజుల్లోగా చెల్లించాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేదంటే పాడి రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జీవో 46 ను రద్దు చేయండి

మంత్రి పొన్నంతో బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : జీవో 46ను రద్దు చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి కోరారు. సోమవారం సెక్రటేరియట్‌లో జీవో 46 బాధితులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. జీవో 46 రద్దుపై మంత్రి సానుకూలంగా స్పందించి, శాసన సభ సబ్ కమిటీలో చర్చిస్తామని హామీ ఇచ్చారని రాకేశ్‌రెడ్డి తెలిపారు.



జనగామలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య. చిత్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

డెడ్ స్టోరేజీకి దేవాదుల రిజర్వాయర్లు

- నీటి విడుదలపై పాలకుల మీన మేషాలు
- నీళ్లు దోచుకుపోతున్న ఆంధ్రా సీఎం
- సోయిమరిచి వ్యవహరిస్తున్న సర్కార్
- రాష్ట్ర ప్రభుత్వంపై పొన్నాల ఫైర్
- నీళ్లివ్వకుంటే రైతులతో కలిసి ఉద్యమం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరిక

జనగామ, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో సరిపడా నీళ్లున్నా.. అసమర్థ, అవగాహన లేని పాలకుల వల్ల దేవాదుల రిజర్వాయర్లన్నీ డెడ్ స్టోరేజీకి చేరాయని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ధ్వజమెత్తారు. మంగళవారం జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల సాగునీటి అవసరాలను గుర్తించిన కేసీఆర్.. నాటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లను విస్తరించి ఎండాకాలంలోనూ మత్తళ్లు దుంకేలా రైతులకు సాగునీరు అందిస్తే.. వ్యవసాయం, పంటల సాగుపై కనీస అవగాహన లేని కాంగ్రెస్ సర్కారు దేవాదుల నీటి విడుదలపై మీన మేషాలు లెక్కిస్తున్నదని మండిపడ్డారు. నీళ్లు లేక డెడ్ స్టోరేజీకి చేరుకొని కళావిహీనంగా కనిపిస్తున్న రిజర్వాయర్లు, ఎండిపోతున్న పంట పొలాలపై రోజూ పత్రికల్లో కథనాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని వాపోయారు. తెలంగాణ నీటిని ఆంధ్రా ముఖ్యమంత్రి దోచుకుపోతుంటే తెలంగాణలో కాంగ్రెస్ పాలకులకు సోయిలేదని ఫైర్ అయ్యారు. నీటి పారుదల వ్యవస్థ, రైతుల అవసరాలపై ముఖ్యమంత్రికి అవగాహన లేదని, బాధ్యతలను సక్రమంగా నిర్వహించని మంత్రులు ఉండటం ప్రజల దౌర్భాగ్యమని పొన్నాల విమర్శించారు. జనగామ జిల్లాకు వరప్రదాయిని వంటి దేవాదుల రిజర్వాయర్లలోకి నీటిని వదిలేందుకు ఫేస్-1లో ఒక్క పంపు నడిపిస్తే ఎలా సరిపోతుందని? ఎన్నిరోజులకు నిండుతాయని? అప్పటి వరకు పంటలు ఎండిపోవా? నారు ముదిరిపోదా? అని రైతులు ప్రశ్నిస్తున్నా.. ఈ ప్రభుత్వం కదలడం లేదని దుయ్యబట్టారు. కోదండరాం ఏ సబ్జెక్టులో ప్రొఫెసర్? ఆయనకు, నీటిపారుదల వ్యవస్థకు ఏం సంబంధం? ఆయన ఏమన్నా.. నీటిపారుదల రంగ నిపుణుడా? వస్తాడు ఏదో చెప్తాడు.. అసలు వ్యవస్థ ఎటుపోతుంది? అని ఫైర్ అయ్యారు.

నీళ్లు ఇవ్వకుంటే ఉద్యమం: ఎమ్మెల్యే పల్లా

జనగామ పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరిందని, తాను వెళ్లి పరిశీలించి అధికారులను నిలదీస్తే తప్ప నీటి విడుదలకు మోక్షం లభించేలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటికీ గండిరామారం, తపాస్‌పల్లి, బొమ్మకూర్ రిజర్వాయర్‌ల కింద 40 శాతం కూడ